

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## రైతు క్షేమంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది

**దేవరకద్ర, మే 5 ప్రభాతవార్త:** రైతు క్షేమంగా ఉంటేనే, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రైతు పంట పండిస్తేనే ప్రజలకు అన్నం అందుతుంది. రైతు సంతోషంగా ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాల అభివృద్ధి చెందితే రాష్ట్రం సుభిక్షంగా మారుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్కెట్ యార్డులో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సభా సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టికి సాధించాలన్నారు. ఒకే రకమైన పంటలు కాకుండా మూడు నాలుగు రకాల పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా వివిధ రకాల పండ్లు, పూలు, కూరగాయలు, తదితర పంటలను సాగు చేపట్టేలా హార్టికల్చర్ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

**ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ...** రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు ఇస్తున్న ప్రాధాన్యతను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి వివరించారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ ఫామ్ ద్వారా స్థిరమైన అధిక ఆదాయం లభిస్తుందని, దీని కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఉద్యాన పంటల సాగు..** వరి, జొన్న, ఒంటి పంటల కంటే పండ్లు, కూరగాయలు, పూల సాగు ద్వారా తక్కువ సమయంలో



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

ఎక్కువ లాభాలు గడించవచ్చుని ఆయన రైతులకు వివరించారు. మార్కెట్ డిమాండ్ భట్టి, ఉద్యానవన పంటలను ఎంచుకోవాలని కోరారు. వ్యవసాయం –మిగతా4లో..



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

### ప్రత్యామ్నాయ పంటలపై

## దృష్టి సారించాలి

**కలెక్టర్ సీహెచ్ ప్రియాంక**

**ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలని సూచన**

**నారాయణ పేట, మే 5 ప్రభాతవార్త :** జిల్లాలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు వారం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం మే 4 నుంచి 9 వరకు కొనసాగనుంది ఈ సందర్భంగా రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, ఆయిల్ ఫామ్ గింజలు, వ్యవసాయ యంత్రాల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా అన్ని శాఖలు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తృతంగా జరుగుతుందని, ఆసక్తి గల రైతులను అక్కడికి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 206 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతోందని, దీన్ని 10 వేల ఎకరాలకు విస్తరించగలిగితే జిల్లాలోనే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ స్థాపనకు అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు కూడా ఆయిల్ ఫామ్, ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, డీఎంఅండ్‌హెచ్ఓ డా. జయచంద్రమోహన్, మండల స్థాయి అధికారులు రైతులు పాల్గొన్నారు.

## తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

- పైప్ లైన్ మరమ్మత్తులు చేపట్టాలి
- సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- సమన్వయంతో గ్రామ సమస్యలు పరిష్కరించాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- తాగునీటి ఎద్దడి నివారించడానికి సత్వర చర్యలు తీసుకోవాలి
- అధికారులు వెంటనే స్పందించాలి
- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గ స్థాయి సమీక్ష



మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 5, ప్రభాతవార్త:** వేసవికాలంలో గ్రామాలలో త్రాగునీటి సమస్య నివారణకు గ్రామ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, మిషన్ భగీరథ అధికారులు, మండల జిల్లా అధికారులు సమన్వయం చేసుకొని పనిచేయాలని, ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ మరమ్మత్తు పనులు త్వరితగతిన చేపట్టి నీటి సరఫరా నిరంతరాయంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై గ్రామ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, మండల, జిల్లా అధికారులతో దేవరకద్ర శాసన సభ్యులు జి .మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గంలోని గ్రామాలలో తాగునీటి సమస్య, గ్రామ అభివృద్ధికి సంబంధించిన ఇతర సమస్యలపై సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తాగునీటి సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మిషన్ భగీరథ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ప్రభుత్వ అధికారులతో నేరుగా మాట్లాడి గ్రామాలలో సమస్యలను పరిష్కరించుకునే వేదికగా ఈ సమీక్ష సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, డ్రైనేజ్ పనులు, సి.సి రోడ్లు, పాఠశాలలకు కాంపౌండ్ గోడలు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, పింఛన్ల పంపిణీ, వంటి పలు ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను, గ్రామ స్థాయిలో పరిష్కారం దొరకనప్పుడు మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి ప్రయత్నించాలని అన్నారు. కొంతమంది అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవటం లేదని, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ఎన్ని సార్లు ఫోన్లు చేసిన స్పందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ ను కోరారు. అధికారులు ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే వంద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, అలాగే గ్రామాభివృద్ధికి సంబంధించి మొదటి దశలో సి.సి రోడ్లులు, డ్రైనేజ్‌లు, బీటీ రోడ్లు మంజూరు చేశామని, వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. రెండో దశలో మిగిలిన గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అధికారులు సర్పంచ్లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఈనెల – మిగతా4లో..



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

## పోలీసులే ప్రజలకు ఆదర్శం

**భద్రతలో రాజీకి తావులేదు : జిల్లా ఎస్పీ డి.జానకి**

**మహబూబ్‌నగర్ క్రైమ్, మే 5, ప్రభాతవార్త:** పోలీసులే ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, ప్రతి ఒక్క సిబ్బంది తప్పకుండా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ సూచించారు. మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం ఏనుగొండలోని ఓం కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందికి హెల్మెట్లను అందజేశారు. ఈ కార్యక్రమం రూరల్ సర్కిల్ సబ్ ఇన్స్పెక్టర్ల ప్రోత్సాహంతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది తమ భద్రతపై అత్యంత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చని, అలాగే కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.

**జిల్లా ఎస్పీ ముఖ్య సూచనలు..**




మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డి.జానకి

ప్రతి పోలీసు విధుల్లో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, వ్యక్తిగత ప్రయాణాల్లో కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగాన్ని ఖచ్చితంగా పాటించాలి, పోలీసుల ప్రవర్తనే ప్రజలకు మార్గదర్శకం అవుతుంది; అందువల్ల నియమ నిబంధనలను ముందుగా మనమే ఖచ్చితంగా అమలు చేయాలి. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసు సిబ్బంది చురుకుగా పనిచేయాలి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ పడకూడదని, విధుల్లో అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుంది. పోలీసులే ప్రజలకు రోల్ మోడల్‌గా నిలిస్తే, సమాజం మొత్తం నిబంధనలు పాటించే – మిగతా4లో..

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**రైతులు వేచి ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి**

**లారీలు, గన్నీ సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, మే 05,ప్రభాత వార్త:** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. మంగళవారం గద్వాల మండలంలోని చెనుగోనుపల్లి, అనంతపురం1, బసల్ చెరువు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అధికంగా ఉండి, లారీలు తక్కువగా ఉండటం వలన కొనుగోలు ప్రక్రియ ఆలస్యమై రైతులు చాలా రోజుల పాటు వేచి ఉండాల్సి వస్తున్నదని గమనించిన కలెక్టర్, అవసరమైన మేరకు అదనపు లారీలు ఏర్పాటు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రంకు రోజుకు కనీసం నాలుగు లారీలు పంపించి రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యమును సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చిన కేంద్రాలకు ప్రాధాన్యత ఇచ్చి, సమీప మిల్లులకు పంపడం ద్వారా సమయం ఆదా అవుతుందన్నారు. ప్రతి కేంద్రానికి నిర్దిష్టంగా సమీపంలోని మిల్లులను కేటాయించి, అధికారిక ఆదేశాల ప్రకారం మాత్రమే కొనుగోలు చేసిన ధాన్యమును లారీల్లో తరలించాలన్నారు. గన్నీ సంచుల కొరతపై స్పందించిన కలెక్టర్ పాత, దెబ్బతిన్న సంచులను వాడకుండా కొత్త గన్నీలు వెంటనే సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రాల వారీగా అవసరాన్ని అంచనా వేసి సరిపడా గన్నీలను పంపిణీ చేయాలని సూచించారు. కేంద్రాల్లోనీ రిజిస్టర్లలో రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు, మిల్లులకు రవాణా చేసిన వివరాలు, ఫోన్ నంబర్లు, తదితరవివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ప్రతి రోజూ కేంద్రంలో ఉన్న ధాన్యం నిల్వలు, తేమ శాతం వచ్చిన పరిమాణం, పంపిన లోడ్ల వివరాలను నమోదు చేసి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు –మిగతా4లో..



కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## ప్రజల సేవలో నిర్లక్ష్యం సహించబోము...

- సమయానికి హాజరు కాకపోతే కఠిన చర్యలు...
- ఆకస్మిక తనిఖీలో అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం...
- సమయపాలన పాటించని వారికి నోటీసులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 05 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వకార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమయపాలనపాటించి ప్రజలకు జవాబుదారీగా విధులను నిర్వర్తించాలని జిల్లాకలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. అధికారుల నిర్లక్ష్యం, సమయపాలన లోపం, ప్రజలకు సేవలలో ఆలస్యం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కార్యాలయాల్లో క్రమశిక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వివిధ శాఖలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా ఉదయం 10:38 గంటలకు జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించగా, ఆసమయానికి కూడా సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడం, కొందరు సిబ్బంది గైర్హాజరు ఉండగా, ఇప్పటికే పిటిషనర్లు, ముఖ్యంగా రిటైర్డ్ పెన్షనర్లు మరియు ఇతర పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కార్యాలయంలో ఎదురు చూస్తుండడం జిల్లా కలెక్టర్ గమనించారు. ఈ పరిస్థితిపై ట్రెజరీ శాఖ అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలు అందించడానికి ఉంటాయి. ప్రజలే ముందుగా వచ్చి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది? అని అధికారులను ప్రశ్నించారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులను వివరణ కోరారు. ట్రెజరీ అధికారి సెలవులో ఉన్నారని తెలియజేయగా, సిబ్బంది పర్యవేక్షణలో ఎటువంటి లోపం ఉండకూ డదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉదయం 10:30 గంటలలోపు ప్రతి అధికారి, సిబ్బంది కార్యాల యానికి హాజరు కావాలని ఆదేశిస్తూ, ఆదేశాలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామ ని. సమయానికి హాజరు కాని సిబ్బందిపై వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పెన్షనర్లు మరియు ఇతర ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి కార్యాలయాలచుట్టూ తిరగాల్సి వస్తోందని కలెక్టర్ ప్రశ్నిస్తూ, ఇటువంటి పరిస్థితులను తక్షణమే నివారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిశాఖలో సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యతారహిత వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా అన్ని శాఖలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు.



అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

### కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం

## తరలించేందుకు ఏర్పాట్లు

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి**

**ఆత్మకూర్ మే 5,ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం జిల్లా వ్యాపితంగా ఏర్పాటు చేసినటువంటి వ్వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు రవాణా సౌకర్యం నిమిత్తం అన్ని ఏర్పాట్లు చేసినట్లుగా వనపర్తి జిల్లాకలెక్టర్ ఆదర్శ సురభి వెల్లడించారు. మంగళవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో వరిధాన్యం కుప్పలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా –మిగతా4లో..



మార్కెట్ యార్డ్ ఆవరణలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## నర్సింగ్ విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలి

**జిల్లా ప్రతిష్టను నిలబెట్టేలా విద్యార్థులు కృషి చేయాలి**

**ఘనంగా నర్సింగ్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే**

**గద్వాల,మే 05,ప్రభాతవార్త :** నాలుగేళ్ల పాటు చదివి బీఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించాక సేవాభావం, సహానుభూతి, మానవత్వంతో కూడిన సేవలను రోగులకు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గద్వాలలోని అనంత ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, ఈ నెల 12న ప్రపంచంలో మొదటి నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పరిష్కరించుకొని నిర్వహించే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి బ్యాచ్‌గా నర్సింగ్ విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని వెళ్లడం సంతోషంగా ఉందని, వారందరూ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలలో మొత్తం 87మంది విద్యార్థులు నర్సులుగా కోర్సు పూర్తి చేస్తున్నందున ఈ సందర్భంగా కలెక్టర్ సహకరించిన వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను అభినందిస్తూ వారి కృషిని ప్రశంసించారు. ఆసుపత్రుల్లోనే కాక దీర్ఘకాలికంగా వివిధ వ్యాధులతో బాధపడే వారికి, వయోవృద్ధులకు, చిన్నారులకు వారి ఇండ్ల వద్ద కూడా సేవలందించేందుకు నర్సులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుని రోగులమానసిక పరిస్థితులకు అనుగుణంగా సేవలు అందిస్తే మంచి పేరు తెచ్చుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆరోగ్యసేవల్లో నర్సింగ్ పాత్రకు ఎలాంటి లోటు ఉండదని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నర్సింగ్ వృత్తికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన సముదాయాన్ని –మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

## పింఛన్ నిరీక్షణ..

**వృద్ధుల వేదనపై అధికారుల నిరక్ష్యం!**

**డబ్బులు ఎప్పుడు వస్తాయో చెప్పలేం" అంటూ**

**అధికారుల సమాధానం**

**ధన్వాడ,మే 5 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలో వృద్ధులు, వికలాంగులు పింఛన్ కోసం పది రోజులుగా ఎదురుచూస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించిన పింఛన్ ఇప్పటికీ జమ కాకపోవడంతో,మే నెల –మిగతా4లో..



పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు, వృద్ధులు

## శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్థికసాయం

**గద్వాల మే 05,ప్రభాతవార్త :**నర్సంపేట డిపోలో ఆర్టీసీ కార్మికుల కోసం ఆత్మబలిదానం చేసుకున్న కీర్తిశేషులు శంకర్ గౌడ్ కుటుంబానికి గద్వాల ఆర్టీసీ డిపో జేఏసీ నాయకులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అందించిన ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ముందుగా శంకర్ గౌడ్ చిత్రపటానికి డిపో వద్ద నివాళులర్పించారు. అనంతరం శంకర్ గౌడ్ స్వగ్రామమైన ముత్తైజిపేట గ్రామానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసాని ఇవ్వడానికి మహబూబ్నగర్ రీజియన్ గద్వాల డిపో నుండి జేఏసీ నాయకులు పరమేశ్వరయ్య, శ్రీధర్ రావు, భాస్కర్, గిరిరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట జేఏసీ నాయకులు లాడే శ్రీకాంత్, కొలిశెట్టి రంగయ్య పాల్గొన్నారు. అదేవిధంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల.కృష్ణమోహన రెడ్డి ఇచ్చినలక్ష రూపాయల చెక్కును కోల శంకర్ గౌడ్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి కి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ జె ఏ సి నాయకులు

## ఆధునిక సాగుపై అవగాహన

**శాస్త్రవేత్తలు డా. కడ సిద్ధప్ప, జి. పార్వతీ**

**అచ్చంపేట,మే 5 ప్రభాతవార్త:** ఆధునిక సాగుపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. మంగళవారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో రైతులకు సాగుకు ముందు శాస్త్రీయ అవగాహన కల్పించే లక్ష్యంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొ॥ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు డా. కడ సిద్ధప్ప, జి. పార్వతీ పాల్గొని రైతులకు పలు ముఖ్యాంశాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ముఖ్యంగా ఆరు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నాణ్యమైన వరి రకాల ఎంపికపై వివరించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, పంట మార్పిడి ద్వారా సుస్థిర దిగుబడులు సాధించడం, సాగునీరు ఆదా చేసి భవిష్యత్ తరాలకు వనరులను కాపాడడం, అవసరానికి తగ్గట్టుగా మాత్రమే రసాయనాల వినియోగం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ నేల ఆరోగ్య సంరక్షణ రైతుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. రైతులు అడిగిన పలు సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చి, ఆధునిక సాగు పద్ధతులపై స్పష్టత కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య ,ఏఈఓ అనూష, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రొ॥ కడ సిద్ధప్ప

## బాలికల సంరక్షణ బాధ్యతగా నిర్వహిద్దాం

**సర్పంచ్ కోడావత్ మంగమ్మ, డిసిపియు లలిత**

**లింగాల,మే 5,ప్రభాతవార్త :** బాలికల సంరక్షణను అందరం బాధ్యతగా తీసుకొని నిర్వహిద్దామని గ్రామ సర్పంచ్ కోడా వత్ మంగమ్మ, నాగర్ కర్నూల్ జిల్లా బాలల సంరక్షణ విభాగం సభ్యురాలు (డిసిపియు) లలిత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అవుసలి కుంట గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో స్నేహ సమ్మర్ క్యాంపు 2026 ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన,బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య ప్రభావం అనే అంశంపై కిశోర బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలలోపు కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా ధైర్యంగా ఉండాలని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా బాగా చదువుకుని ఎదగాలని సూచించారు. బాలికలు ఎటువంటి సెల్‌ఫోన్, ప్రసార మాధ్యమాలకు లోనుకాకుండా ధైర్యంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుండి ఎటువంటి ఇబ్బందులు వచ్చినసంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి రక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామఉపసర్పంచ్ చాపలమధు,పంచాయతీ కార్యదర్శి ఎన్. చంద్రయ్య,డిసిపియు లలిత, 1098 నిర్వాహకురాలు ప్రమీల, విద్యా కమిటీ చైర్మన్ నాగమణి, వివోఏ శారద, పార్వతమ్మ, అంగన్‌వాడి ఉపాధ్యాయులు ఉమ, చెన్నమ్మ, వార్డు సభ్యులు రామస్వామి, మశన్న, సంగి శెట్టి గౌతం కుమార్, గ్రామ యువకులు స్వామి, రమేష్, రాము కిషోర బాలికలు పాల్గొన్నారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## రేషన్ డీలర్ల వెయింగ్ మిషన్‌ల తనిఖీ

**కెటిదొడ్డి మే 05, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రైతు వేదికలో డీలర్ల తో సమావేశం ఏర్పాటు చేసిన మెట్రాలజీ అధికారి ప్రవీణ్ కుమార్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మండల పరిధిలోని ఆయా గ్రామాల రేషన్ డీలర్ల వెయింగ్ మిషన్ లను క్షుణ్ణంగా తనిఖీ లు నిర్వహించి, వెయింగ్ మిషిన్ నా టెక్నీషియన్ రాజశేఖర్ తో రిపేరులు చేయించి స్టాంపింగ్ వేసిన జిల్లా మెట్రాలాజి అధికారి రేషన్ డీలర్లు మిషన్ లు ఎలాంటి రిపేరులు వచ్చిన మెట్రాలాజి అధికారుల అనుమతితో రిపేరులు చేయించుకోవాలని, వినియోగదారులకు ఆటంకం కలిగించకూడదని రేషన్ డీల్లర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల అధ్యక్షులు డి. కృష్ణ, ప్రధానకార్యదర్శి సిద్దయ్యస్వామి, రేషన్ డీలర్లు ప్రభు, రాంబాబు, ఆయా గ్రామాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల సాకారమైంది

**ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు**

**అచ్చంపేట, మే, 5 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి సొంతింటి కల సాకారమయ్యే విధంగా ముందడుగు వేసిందని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలో 10వ వార్డు రెండవ వార్డులలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఆదేశాలమేరకు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. నిరుపేదలైన వారికి రూ.5 లక్షలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, నిరుపేదల కళ్ళల్లో నేడు ఆనందం ఎంతో సంతృప్తినిచ్చిందనారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్ పాషా,లాలూ యాదవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే మిల్లుకు తరలించాలి

**వనపర్తి రూరల్, మే 5, ప్రభాతవార్త:**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తెచ్చిన ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే కేటాయించిన మిల్లుకు తరలించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సూచించారు. మంగళవారం వరి కొనుగోలు ప్రక్రియను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ వనపర్తి మండల పరిధిలోని చిట్యాల మార్కెట్ యార్డులో, కొత్తకోట మండల పరిధిలోని వడ్డే వాటా, సంకిరెడ్డిపల్లి, ముమ్మల పల్లె గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో కొనసాగుతున్న కొనుగోలు ప్రక్రియను ఆయన సమగ్రంగా పరిశీలించారు. కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ధాన్యం రికార్డులను పరిశీలిస్తూ నమోదు పత్రాల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటుచేసిన క్లీనర్లను వినియోగించుకుని వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. చాలా చోట్ల వరిలో తాలు, మట్టి, గడ్డి ఎక్కువగా కనిపిస్తుందని, తాలు లేకుండా ఉంటే మిల్లర్లకు ధాన్యంలో కోత పెట్టడానికి ఆస్కాము ఉండదని పేర్కొన్నారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన తమ ధాన్యంలో తాలు లేకుండా, ప్యాడి క్లీనర్లను వినియోగించుకుని శుభ్రపరచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కేంద్రాల ఇన్చార్జిలకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలన్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే తూకం చేసి కొనుగోలు పూర్తి చేయాలని, ఆ తర్వాత ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ వేగంగా జరగాలని తద్వారా రైతులకు నగదు చెల్లింపులు వంటి అంశాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

# గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ◆ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- ◆ శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**ఊర్కొండ,మే05 ప్రభాతవార్త:**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకే ఊర్కొండ మండల పరిధిలోని ఊర్కొండపేట, ముచ్చర్లపల్లి గ్రామాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణాల పురోగతి, నాణ్యత, ప్రభుత్వ నిబంధనల అమలు తదితర అంశాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సొంత ఇంటి కళను నిజం చేసుకోవాలని సూచించారు. పనులను ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని, నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్లులను దశల వారీగా ఆధార్ లింక్ చేసిన బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకోవాలని కూడా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా గ్రామాల్లోపారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, చెత్త నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా, పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా క్రమం తప్పకుండా శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల్లో కూడా పరిశుభ్రతపై అవగాహన పెంచాలని సూచించారు. ముచ్చర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్‌కు అక్కడి గ్రామస్తులు పలు సమస్యలను వివరించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల లోపం, మరమ్మత్తుల అవసరం వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశిస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు గ్రామ సందర్శనలో భాగంగా ఊర్కొండపేట ఆంజనేయ స్వామి ఆలయాన్ని కలెక్టర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. జిల్లా కలెక్టర్ కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, వెంట పిడి హౌసింగ్ సంగప్ప, తహసిల్దార్ యూసుఫ్ అలీ, ఎంపీడీవో, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలి

- ◆ గుంతకోడూరులో ఉపాధి హామీ పనులను పరిశీలన
- ◆ ఫీడర్ ఛానల్ పూడికతీత పనుల్లో నాణ్యత పాటించాలి
- ◆ క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల పురోగతిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 05 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూర్ మండలంలోని గుంతకోడూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కొనసాగుతున్న ఫీడర్ ఛానల్ పుడికలు తీసే పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలు, పనుల స్థితిగతులపై వివరాలు తెలుసుకున్నారు. వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులకు వచ్చే ప్రజలు ఉదయం 6 గంటలకే పనిస్థలానికి చేదుకోవాలని, కొంతమంది కూలీలు గుట్కా, తంబాకు వంటి హాని కలిగించే పదార్థాలను తీసుకుంటున్న అంశాన్ని గుర్తించిన కలెక్టర్ వాటి వల్ల జరిగే అనార్థాలను కూలీలకు వివరించారు. అలాంటి హానికరమైన వాటి దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పని ప్రదేశంలో జరుగుతున్న తవ్వకాలు, మట్టిపనులు, కాలువ విస్తరణ పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, సాంకేతిక ప్రమాణాలు, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. పనులు సమయానికి పూర్తి చేయడంలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో కలెక్టర్ చర్చిస్తూ, వారికి కేటాయిస్తున్న పని దినాలు సరిపోతున్నాయా, వేతనాలు సమయానికి అందుతున్నాయా, పనిస్థలంలో త్రాగునీరు, నీడ వంటి ప్రాథమిక సదుపాయాలు ఉన్నాయా అనే అంశాలను కూడా కలెక్టర్ తెలుసుకున్నారు. కూలీల వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం జరగకుండా, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కూలీలకు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా స్థిరమైన ఆదాయం లభించాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టినట్లు అందువల్ల ప్రతి కూలికి న్యాయమైన వేతనం, తగిన పని దినాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఫీడర్ ఛానల్ పనులు పూర్తయ్యాక గ్రామంలో చేపట్టబోయే పనులపై ప్రణాళికలు పొందించుకొని కూలీలకు అనువుగా పనులు కేటాయించాలని, పనుల నమోదులు, హాజరు వివరాలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేస్తే గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంట పీడీ డిఆర్డీవో చిన్న ఓబులేసు మండల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

## వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా

## రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్

**అమరచింత మే 5, ప్రభాతవార్త;** రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం విక్రయించే ముందు వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా ముందు జాగ్రత్తగా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె రైతు వేదిక వద్ద ఏర్పాటుచేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అలాగే ధాన్యం నమో రిజిస్టర్ను తనిఖీ నిర్వహించారు. అమరచింతలో పిఎసిఎస్ ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా ఉంటే మిల్లర్లకు ధాన్యములో కోత పెట్టకుండా ఉంటుందని జిల్లా కలెక్టర్ సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను వరుస క్రమంలో రిజిస్టర్లలో నమోదు చేసుకొని వరుస క్రమంలో వరి ధాన్యం కొనుగోలు చేసి అధికారులు కేటాయించిన మిల్లులకు పంపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులకు ట్రాన్స్పోర్ట్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిఎం ఆంజనేయులు, అమరచింత తహసిల్దార్ రవికుమార్, ఆర్ ఐ గోపాల్, ఐకెపి అధికారులు, పిఎసిఎస్ అధికా రులు సిబ్బంది పాల్గొన్నారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రం దగ్గర రిజిస్టర్ ను తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

# శాంతియుత వాతావరణంలో పండగను జరుపుకోవాలి

**అదనపు ఎస్పీ రాజేష్ మీనా**

**ముస్లిం మత పెద్దలతో**

**డిఎస్పీ కార్యాలయంలో సమావేశం**

**వనపర్తి, మే 5, ప్రభాతవార్త :**మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వనపర్తి జిల్లాలో బక్రీద్, పండుగను సోదర భావంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, అన్నారు. బక్రీద్, పండుగ సందర్భంగా మంగళవారం రోజు వనపర్తి డిఎస్పీ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు..ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్, పండుగ శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతపెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు .ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పశు సంవర్ధక శాఖ సిబ్బందితో 3 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉంటేనే, పరిశీలించి అనుమతి స్తారని అన్నారు. ప్రధానంగా నిబంధనలు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే సామరస్య పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు. ముఖ్యంగా యువత ఆవేశంతో చేస్తున్న చిన్న తప్పులు శాంతి భద్రతల సమస్యగా తలెత్తె ప్రమాదం వుంటుంది కాబట్టి మతపెద్దలు యువతకు సమన్వయం పాటించేలా దిశానిర్దేశం చేయాలని అన్నారు. ప్రధానంగా జిల్లాలో ఏచిన్న సంఘటన జరిగిన ఎడిటింగ్ చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల ఐక్యతను, సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టడం తద్వారా శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తున్న వారిపై పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టిందని తెలిపారు. సమావేశంలో ఇతర పోలీస్ అధికారులు కూడా పాల్గొని తమ తమ సూచనలు వెల్లడించారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు పోలీస్ శాఖ మరియు ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పోలీసుశాఖ చర్యలను అభినందిస్తూ, శాంతి భద్రతలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ముస్లిం మత పెద్దలు,యువకులు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మైనారిటీ పెద్దలతో సమావేశమైన అదనపు ఎస్పీ

# అమృత్ 2.0 పనుల నాణ్యత పై దృష్టి సారించాలి

**వనపర్తి ప్రతినిధి, మే 5, ప్రభాతవార్త:** అమృత్ 2.0 పనుల నాణ్యత, వేగం,సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు. మంగళవారం వనపర్తి మున్సిపాలిటీ, కొత్తకోట మున్సిపాలిటీలలో అమృత్ 2.0 పనులను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షి ంచారు. పనుల నాణ్యత, వేగం, సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అదనంగా, పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి దశలో పర్యవేక్షణ పెంచాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు ఇచ్చారు. మున్సిపాలిటీ చైర్పర్సన్ మాధవి, కమీషనర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



అమృత్ 2.0 పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

**నారాయణపేట,మే 5 ప్రభాతవార్త :**జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని నిర్ణయం జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లాకలెక్టర్ సీహెచ్ ప్రియాంకను జిల్లా ఎస్పీ డా.వినీత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఎస్పీ పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలు,ప్రజా సమస్యల పరిష్కారం,అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలు వంటి ముఖ్య అంశాలపై ఇద్దరు అధికారులు చర్చించారు. జిల్లా అభివృద్ధి కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని, ప్రజల సంక్షేమం దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.



## చలివేంద్రం ఏర్పాటు

**వంగూరు, మే 05 ప్రభాతవార్త:** గాజర గ్రామంలో నూతన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ శ్రీ పులిగిల్ల శ్రీపతి రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని, నీటిని వృధా చేయకుండా అందరు ఈ యొక్క నీటిని తాగడానికి వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఎండాకాలంలో ఎక్కువసేపు ఎండలో ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లెపాకుల రాజు, వార్డ్ మెంబర్స్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## యువ నాయకుడు చేయూత

**నిరాశ్రయురాలికి ఇల్లు కట్టుకోవడానికి 30 బస్తాల సిమెంటు అందజేసిన డిప్యూటీ సర్పంచ్ షేక్ జలీల్**

**తాడూర్, మే 5 ప్రభాతవార్త :** తల్లి తండ్రి లేని నిరాశ్రయురాలికి ఉప సర్పంచుల సంఘం నాగర్ కర్నూల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, పాపగల్ గ్రామ డిప్యూటీ సర్పంచ్ షేక్ జలీల్ చేయూతనిచ్చి అండగా నిలిచారు. తాడూరు మండలం పాపగల్ గ్రామ వాసి అయిన రమ్యకు తల్లి తండ్రులు లేరు. ఇల్లు కట్టుకోవడానికి తన వంతుగా షేక్ జలీల్ 30 సంచులు సిమెంట్ అందజేశారు. పేద ఆడబిడ్డకు అండగా నిలిచిన చెల్లెలు గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందించారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం...

**మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్**



ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

**కల్వకుర్తి, మే 05 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపాలిటిలోని ఇందిరానగర్ కాలనీలోని 21 వార్డు లో ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ ఛైర్మెన్ శానవాజ్, 21 వ వార్డ్ కౌన్సిలర్ మబ్బు రామరాజు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డిలు గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పేద ప్రజల సోంత ఇంటి కళ నేరవేందన్నారు. ప్రజా పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖులు,మాజీ కౌన్సిలర్స్, కాలనీ వాసులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గజ్జ ఆంజనేయులు గౌడ్,బాలు గౌడ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

# రైతు ప్రయోజనాలే ముఖ్యం

◆ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 5 ప్రభాతవార్త:** రైతు ప్రయోజనాలే ముఖ్యంగా, రైతులకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా వరి కొనుగోళ్లు జరగాలనే ఉద్దేశంతో అవసరమైన ప్రతి ప్రాంతంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రైతు వారము" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మార్కెట్ యార్డు లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినవరి కొనుగోలు కేంద్రాలనుఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారం భించి మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం అధిక సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభించామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి,ఉన్నతాధికారులు నిరంతరంపర్యవేక్షణ చేస్తున్నారని,వారితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ రైతులకు సహకారం అంది స్తున్నారని తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, లారీల ద్వారా రైస్ మిల్లులు, గోదాములకు తరలించే బాధ్యతను ప్రభుత్వం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం రైతులకు మంచిధర లభిస్తోందని,కొందరు రైతులు ప్రైవేట్ మిల్లులకు కూడా అమ్మకాలు జరుపుతున్నారని వెల్లడించారు. సన్న వడ్లకు ప్రభుత్వం అదనంగా బోనస్ అందజేస్తుండటంతో రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు వస్తున్నారని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ పాలనలో రైతులుఇబ్బందులకు గురయ్యారని విమర్శిస్తూ, ప్రస్తుతంప్రజా ప్రభుత్వం వ్యవసా యాన్ని పండుగలా మార్చిందన్నారు. రైతు భరోసా పెంపుతో పాటు బోనస్ పథకం ద్వారా వేల కోట్ల రూపాయలు రైతులకు అందించినట్లు చెప్పారు. రెండు లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి సుమారు 25లక్షల రైతు కుటుంబాలకు లాభం చేకూర్చినట్లు పేర్కొన్నారు. గతంలో విడతల వారీగా ఇచ్చిన రుణమాఫీ వడ్డీకే సరిపోగా, ప్రస్తుతం ఒక్క విడతలోనే పూర్తి రుణమాఫీ అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే ప్రత్యేకమని ఆయన అన్నారు. ఒకే రకమైన పంటలు కాకుండా వాణిజ్య పంటలు కూడా రైతులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మహబూబ్ నగర్ కార్పొరేటర్లు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం నుంచి ఆర్థిక సాయం



జర్నలిస్టు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ మే 5 ప్రభాతవార్త:** జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న నమస్తే తెలంగాణ సీనియర్ జర్నలిస్టు దయాకర్‌కు, అలాగే ఇటీవల విధి నిర్వహణలో మరణించిన సీనియర్ జర్నలిస్టు దాసరి నర్సింహులు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఇద్దరు జర్నలిస్టు కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల చొప్పున చెక్కులను పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘం తరుపున ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రైవేటు ఆసుపత్రులలో ఉచిత ఓపిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వాకిట అశోక్ కుమార్, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కోశాధికారి రఘు, నాయకులు రమాకాంత్ రెడ్డి, సతీష్, తిరుపతయ్య, సతీష్ రెడ్డి, జనార్ధన్, రాము, క్యూ న్యూస్ రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి రవాణాపై పోలీసుల కఠిన చర్యలు

◆ ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత ◆ కేసులు నమోదు చేసిన పోలీసులు

**ధన్వాడ, మే5 ప్రభాతవార్త:** మండలంలో అక్రమంగా మట్టి తరలింపుపై పోలీసులు కఠినంగా వ్యవహరించారు.ఎలాంటి అనుమతులు లేకుండాఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానిక పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మందిపల్లి గ్రామ సమీపంలోని గుట్ట నుంచి ఎర్రమట్టిని అక్రమంగా తరలి స్తున్న ట్రాక్టర్లనుపోలీసులు అడ్డుకుని తనిఖీచేశారు.ట్రాక్టర్ల డ్రైవర్లను నిలిపి వివరాలు సేకరించగా, వారికి అవసరమైన ఎలాంటి అనుమతులు లేవని వెల్లడైంది. దీంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. అనంతరం సంబంధిత వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా సహజ వనరులను అక్రమంగా తరలించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మండలంలో అక్రమ మట్టి రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.

## స్వీయ గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**బిజినేపల్లి, మే 5 ప్రభాతవార్త:** జనగణన 2027 లో భాగంగా ఏప్రిల్ 26 నుంచి మే నెల 10 వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వీయ గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసిల్దార్ మునీరుద్దీన్ సూచించారు. సోమవారం తహసిల్దార్ జనగణనకు సంబంధించిన పోర్టల్ ద్వారా ప్రతి ఒక్కరూ తన, కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు సమయంలో ప్రతి వ్యక్తికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. గృహ గణన సమయంలో ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్కు ఈ ఐడీ నంబర్ చెప్పాలని సూచించారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ ద్వారా ఎవరైనా సులభంగా వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. ఆన్లైన్ ద్వారా సేకరించిన సమాచారం గోప్యంగా ఉంటుందన్నారు. జనగణన సమాచారం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు,సంక్షేమ పథకాలఅమలుకు కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా సరైన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ చిక్కుడు రవికుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక హోమములు

**ఉప్పునుంతల,మే 5 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీ పరిధిలోని శివారు గ్రామమైన గట్టు కాడిపల్లి లో శ్రీ ఆంజనేయ స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవ సందర్భంగా రెండో రోజైన మంగళవారం ఘనంగా సామూహిక హోమములు జరిగాయి. ప్రాంతఃకాల పూజలు, దీక్ష హోమం, ఆదివాస హోమం, ధ్యాన, శయ్యాదివాసం, మహావివేదన , మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు దంపతులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి దంపతులు,ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు దంపతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి




**రాజాపూర్, మే 5 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని కుచ్చర్‌కల్ గ్రామంలో మంగళవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుజయ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కుచ్చర్ కల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ కుచ్చర్ కల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సుజయ్ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చెందేలా చూస్తానని గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుజయ్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి కి జడ్చర్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు అలాగే రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు, యువకులకు సుజయ్ చంద్రారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సుజయ్ చంద్రారెడ్డి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ధాన్యం పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**మదనాపురం, మే 5 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యా న్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదే శించారు. మంగళవారం మండల కేంద్రంలోని మదనాపురం మార్కెట్ యార్డులో ఐకెపి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాల న్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొను గోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన క్లీనర్లు వినియోగించుకుని వరి ధాన్యంలో తాలు,గడ్డి,మట్టి లేకుండా కేసుల రైతులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదే శించారు, తాలు లేకుండా ఉంటే మిల్లర్లకు ధాన్యంలో కోత పెట్టడానికి ఆస్కారం ఉండదని సూచించారు,తూకం, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ధాన్యం నమోదు రిజిస్టర్ తనిఖీలు చేసిన కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను వరుస క్రమసంఖ్య రిజిస్టర్లు నమోదు చేసుకొని వరుస క్రమ సంఖ్యలో తూకం చేసి వెంటనే లోడింగ్ చేసి కేటా యించిన బిల్లులకు పంపించాలని అన్నారు, ట్రాన్స్‌పోర్ట్ విషయం లో లారీలకు సంబంధించిన ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని డిఎంకు సూచించారు. మండలానికి ధాన్యాన్ని మిల్లు లకు తరలించిన వెంటనే ట్రక్ షీట్ తెప్పించుకుని, ట్యాబ్ ఇంటి పూర్తి చేసి రైతులకు ఖాతాలో వేగంగా నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరేనా సౌకర్యాలు ఉండేలాగా చూడాలని ఆయన ఆదేశించారు,ఎండలు ఎక్కువ ఉన్ననేపథ్యంలో కొనుగోలు కేంద్రం లో తాగునీరు, నీడ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు,దాన్ రకం వరి వేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు, ఈ రకం పంట వేయడం దార లూకా ఎక్కువగా వస్తుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు, ఆయన వెంట డిసిఎస్ఓ కాశి విశ్వనాథ్, డిఎం ఆంజనేయులు, మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఆర్ఐ రాజేశ్వరి, ఏపీఎం తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు,మహిళలు హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేసేందుకు..

# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల మే 5, ప్రభాతవార్త:** జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీనిబలోపేతంచేసేందుకు మే 2026 లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు రిజ్వాన్ బాషాషేక్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనపు కలెక్టర్ బి. నర్సింగ్‌రావును ఉపాధ్యక్షుడు, ప్రత్యేక అధికారి గా, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి వేణు గోపాల్, జిల్లా ఉపాధి కల్పన అధికారి చరణ్ దీప్‌లను నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మే 1 నుంచి 31వ తేదీ వరకు సభ్యత్వ నమోదు ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ సులభంగా కొనసాగిం చేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక డేటా సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి తాత్కాలిక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమిస్తామని కలెక్టర్ తెలి పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, చురుకుగా పాల్గొని రెడ్ క్రాస్ సేవలకు మద్దతు ఇవ్వాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెడ్ క్రాస్ సంస్థ యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితులు వంటి సందర్భాల్లో జాతి,మతం,వర్ణ భేదాలు లేకుండా బాధితులకు సహాయం అంది స్తుందని తెలి పారు.ఆరోగ్య పరిరక్షణ,వ్యాధి నివారణ, విపత్తు సిద్ధత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి సేవలంది స్తోందని తెలిపారు.సభ్యత్వ రుసుములు పేట్రన్ రూ.25,000, వైస్ పేట్రన్ రూ.12,000, లైఫ్ మెంబర్ రూ.1,000, సంస్థాగత సభ్యత్వం సంవత్సరానికి రూ.5,000 ఉంటుందని తెలిపారు. రెడ్ క్రాస్‌కు ఇచ్చే విరాళాలకు 80బి కింద పన్ను మినహాయింపు ఉంటుందన్నారు.ఈమానవతా సేవలో భాగంగా ప్రజలువిరాళాలు ఇవ్వడం, సభ్యత్వం పొందడం లేదా స్వచ్ఛంద సేవకులుగా పాల్గొనవచ్చని తెలిపారు.

# హిందూ ధర్మం సంస్కృతి సనాతనమైనది

◆ ఆచార్య అభినవ శంకరానంద స్వామి




మాట్లాడుతున్న ఆచార్య అభినవ శంకరానంద స్వామిజీ

**బిజినేపల్లి, మే 5 ప్రభాతవార్త:** అంటరానితనం, కుల ఆధారిత వివక్షను తొలగించడం ద్వారానే హిందూ సమాజం ఉద్ధరణ సాధ్యమవుతుందని వేదాంత గీత శివం ఫౌండేషన్ శ్రీశ్రీశ్రీ పూజ్య ఆచార్య అభినవ శంకరానంద స్వామిజీ అన్నారు. మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో హిందూ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శంకరానంద స్వామిజీ మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి అందర్నీ సమానంగా ఆదరిస్తుందని, వసుధైక కుటుంబం అన్న ధ్యేయవాక్కుతో ప్రపంచ దేశాలను ఆకర్షిస్తోందన్నారు.మన ధర్మం ఎంత గొప్పదో వివరించారు. అక్రమ మత మార్పిళ్ల విష యంలో అత్యంత జాగరూకతతో వుండాలని సూచించారు. దేశ భక్తిని ప్రతి ఒక్కరూ మరింత పెంపొందించుకోవాలని,దీని ద్వారా సమాజానికి సేవ చేయాలని సూచించారు.మనదేశం పేరు చెప్పగానే గంగామాత, భగవద్గీత, సీతామాత గుర్తుకురావాలని వారన్నారు. హిందువులెప్పుడూ ఎవరి చెడునూ కోరుకోరనీ, దేశాన్నిముక్కలు చేయరని పేర్కొన్నారు.కొనేటప్పుడు, తినేట ప్పుడు ఎప్పుడైనా సరే మనధర్మానికి చెందిన వారిదగ్గర తీసుకో వాలని,స్వదేశీని ప్రోత్సహించాలని వారు పిలుపునిచ్చారు.ప్రధాన వక్తగా విశ్వ హిందూపరిసత్ అఖిల భారత అధికార ప్రతినిధి డా.రావి నూతల శశిధర్ మాట్లాడుతూ యావత్ హిందూ సమాజం ఐక్యం గా వుండాలని వారంతా పిలుపునిచ్చారు. ఇప్పుడు మేల్కొనక పోతే..భవిష్యత్తులో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుం దని సూచించారు. కులం, వర్గం ఆధారంగా హిందువులను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై హిందువులు అప్రమత్తం గా వుండాలని పిలుపునిచ్చారు. భారత దేశ గొప్ప దనాన్ని వివరించారు. స్వాతంత్ర సమరయోధుల పోరాటాలు, త్యాగాలను గుర్తు చేశారు. అలాగే భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని వివరిం చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఈ సమ్మేళనాల ద్వారా ఐదు ముఖ్యమైన జీవన సూత్రాలను, అవే పంచపరివర్తన్ అంటే సామాజిక సమరసత, కుటుంబ ప్రభోధన్, పౌరవిధులు, స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ అనే ఐదు సూత్రాల ద్వారా సమాజంలో మార్పు జరగాలని వాటన్నింటితో కూడిన బలమైన సమాజం రావాలని,ఈ హిందూ సమ్మేళనాల ద్వారా సమాజంలోకి తీసు కెళుతోంది అన్నారు.నేటి వేగవంతమైన ప్రపంచంలో మన మూలాలను గౌరవించుకుంటూ, ఐకమత్యంతో ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మద్దిమడుగు ఆంజనేయ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జయరాం గురూజి మాట్లాడుతూ హిందూ ధర్మం సంస్కృతి సనాతనమైనది. అది కేవలం గతం కాదు, ఈ దేశపు వర్తమానం అలాగే భవిష్యత్తు కూడా అన్నారు. "గడప లోపల కులం గడప దాటితే హిందువులం" అనే నినాదం మన గుండెల్లో ప్రతిధ్వనించాలి అని కోరారు. మన మధ్య ఎన్ని అంతరాలు ఉన్నా, సమాజ హితం కోసం వాటన్నింటినీ పక్కన పెట్టాలని,విభజనలను వీడి,విద్వేషాలకు తావు లేకుండా, ఒకరి కొకరు తోడుగా నిలిచే సమసమాజాన్ని నిర్మించడమే ఈ సమ్మేళనాల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మన రాజకీయ పార్టీలు వేరు కావచ్చు, మనం నివసించే ప్రాంతాలు వేరు కావచ్చు, మనం మాట్లాడే భాషలు వేరు కావచ్చు కానీ, మనందరినీ కలిపి ఉంచేది ఒక్కటే అదే మన ధర్మం అన్నారు. న్యాయవాద పరిషత్ జిల్లా ఉపాధ్యక్షురాలు ధనాల పూర్ణిమ మాట్లాడుతూమన సంస్కృతి గతం కాదు, నిత్య నూతనమైన వర్తమానం అని ప్రపంచానికి చాటుదాం అని పిలుపునిచ్చారు. సర్పంచ్ మిద్దె ఇందిరా రాములు మాట్లాడుతూహిందువులు అంతాఐక్యంగా వుండాలని పిలుపునిచ్చారు. మనమంతా ఒక్కటే అనే భావనతో ఈ సమ్మేళనంలో పాల్గొందాం అన్నారు.చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు కట్టా రమేష్ , పులేందర్ రెడ్డి , శ్రీనివాసులు ,ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆధునిక సాగుతోనే అధిక లాభాలు

● రైతుల పొలాలలో భూసార పరీక్షలు తప్పనిసరి ● వ్యవసాయ అధికారులు వెల్లడి



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్

**ఉప్పునుంతల,మే 5 ప్రభాతవార్త:** రైతులు మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుతూ భూసారని కాపాడుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పాలెం శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాలలో భాగంగా ప్రొ॥ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని మర్రిపల్లి రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం శాస్త్ర వేత్త స్వర్ణలత పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్లో అధికంగా డిమాండ్ ఉన్న వరి రకాలను, వ్యవసాయంలో రసాయనాలను వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతుల కు వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ మాట్లాడుతూ వ్యవ సాయంలో యూరియా వినియోగాన్ని తగ్గించాల్సిందిగా, సేంద్రీ య వ్యవ సాయ సాగుతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చుని, ముఖ్యం గా రైతులు పంట మార్పులో భాగంగా అపరాలను, నూనె గింజ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. రైతు లు కోతుల బెడద, అడవి పందుల బెడద లేని ఆముదం పంటను యాసంగి లో సాగు చేసుకోవాల్సిందిగా సూచించారు. అదేవిధంగా వ్యవసా యానికి అవసరమయ్యే నీటి వనరులను సక్రమంగా వినియో గించవలసిందిగా, నీటి ఆదా చేయడానికి డ్రిప్పు, స్ప్రింక్లర్ల పద్ధతుల ద్వారా అన్నిటి యజమాన్యం చేపట్టాల్సిందిగా రైతులకు సూచించారు. అధిక యూరియా వాడడం వల్ల రైతులకు, సాగు భూమికి జరిగే నష్టాలను ఏ ఓ రమేష్ క్లుప్తంగా వివరించారు. వ్యవసాయంలో నేలసంరక్షణ, భూసార పరీక్ష ఆధారిత ఎరువులు యజమాన్యం యొక్క ప్రాముఖ్యత గురించి రైతులు ఆ దిశగా ఆలోచించాల్సిందిగా ఆయన కోరారు. భూసార పరీక్షలకు మట్టి నమూనా సేకరణ ఏవిధంగా చేపట్టాలో మండల విస్తీర్ణ అధికారిణి లక్ష్మీ రాఘ సందే రైతులకు వీడియో రూపంలో, డెమో రూపంలో రైతులకు చేసి చూపించారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం శాస్త్రవేత్త స్వర్ణలత, మండలవ్యవసాయ అధికారి కొర్రరమేష్, మండల విస్తీర్ణ అధికారిణి లక్ష్మీ రాఘసందే, లక్ష్మాపూర్ సర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సంబరాలలో భాగంగా స్వీట్లు తినిపించుకుంటున్న బిజెపి నాయకులు

## బిజెపి నేతల సంబరాలు

**అచ్చంపేట, మే, 5 ప్రభాతవార్త:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయాన్ని సాధించిన సందర్భంగా పట్టణంలో మంగళవారం బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు.బీజేపీ పట్టణ అధ్యక్షులుగండు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ కూడలిలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీరాష్ట్ర నాయకులు మంగ్యనాయక్, బాలాజీ, హాజరై మాట్లాడారు. దేశ ప్రజలు నరేంద్ర మోడీ నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉంచారని, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఇందుకు స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు.ముఖ్యంగా అస్సాం,బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో పార్టీ విజయాన్ని సాధించడం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వచ్చిన ప్రజా మద్దతును ప్రతిబింబిస్తోందని తెలిపారు.ఈ విజయంతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరిగిందని, భవిష్యత్తులో కూడా బీజేపీకి ప్రజల మద్దతు మరింత బలపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అచ్చంపేట గడ్డపై కాషాయ జెండా ఎగురు వేస్తాం అని ధీమావ్యక్తం చేశారు.కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రేణయ్య, రాంచంద్రయ్య, శంకర్ మాదిగ, చందులాల్ చౌహాన్, శివ చంద్ర, రంగినేని రవీందర్, గాలిమూడి రాము, రావు,చందు, రాకేష్, జానకిరాములు, తేజస్విని, లిలాబాయి, అమర్, భాస్కర్, అజయ్‌స్థానిక నాయకులు,కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## సమస్యలపై తక్షణ పరిష్కారం





ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**దేవరకద్ర, మే 5 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ,సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, తదితర ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామంలో డ్రైనేజ్,త్రాగునీరు, కరెంట్,రోడ్లు, విద్యుత్, గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై అధికారులతో చర్చించి పలు సమస్యలను తక్షణం పరిష్కరించి, మిగతా సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలోబస్వాయిపల్లి సర్పంచ్‌శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గోపాల్ దీన్నే సర్పంచ్ దొడ్ల కవిత

**వీపనగండ్ల మే 5, ప్రభాతవార్త:** గోపాల్ దీన్నే గ్రామంలో ఐకెపి మహిళా సమైక్య ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి దొడ్లకవిత మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా, తేమశాతం సరిగ్గాఉన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని, గన్ని బ్యాగులు, లారీలు కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని,డాటా ఎంట్రీ పగటి బందిగా నిర్వహించాలని,ఆమె తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సరైన పద్ధతిలో వరి కొనుగోలు కేంద్రం నిర్వహించాలని వారు చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్‌వెంకటయ్య,తోపాటు రైతుసంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి దొడ్ల బాల్‌రెడ్డి మాజీ సర్పంచ్ కురుమయ్య, మాజీ ఉప సర్పంచ్ కురుమయ్య, ఐకెపి సీసీలు కాశీనాథం,నాగరాజు, మహిళా సమైక్య అధ్యక్షురాలు శివ లీల, సమైక్య గ్రామ కమిటీ సభ్యులు, అమాలి నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పదిలో మెరిసిన ప్రతిభావంతులకు సన్మానం

**నర్వ, మే 5 ప్రభాతవార్త:** నర్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లో అద్భుతమైన ఉత్తీర్ణతను నమోదు చేసి, విద్యా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును చాటుకుంది. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన 71 మంది విద్యార్థులకు 71 మంది ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలను సాధించడం విశేషం.ఈ అరుదైన విజయాన్ని సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత,ఉపాధ్యాయ బృందం,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలుసునీత మాట్లాడుతూ" ఉపాధ్యాయుల నిరంతర శ్రమ,విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం గ్రామస్థుల సహకారం ఈ విజయానికి ప్రధాన కారణం అని కొనియాడారు. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగాఉన్నత విద్యనుఎంచుకుని,సమాజంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.చదువుఒక్కటే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి మార్గమని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.మధుసూదన్, మన్యం, మల్లేష్, స్వరూప (పిడి),అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు సంతోష, మంజుల, మాజీ చైర్మన్లు అయ్యన్న, రఫీక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బుచ్చా రెడ్డి, పూర్వవిద్యార్థి ఆర్.అయ్యన్న,విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే సమ్మర్ క్యాంప్ ప్రారంభం

పిల్లలు, మహిళలకు ఆత్మరక్షణ శిక్షణ

45 రోజుల జూడోకాన్ కరాటే శిక్షణ

క్రమశిక్షణతో పాటు స్పోర్ట్స్ కోటా అవకాశంపై అవగాహన

**ధన్వాడ, మే 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే విద్యాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 45 రోజుల సమ్మర్ కరాటే శిక్షణ శిబిరం మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని ముఖ్యంగా ఐదు సంవత్సరాల పైబడిన చిన్నారులు, మహిళా సోదరీమణులను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్నారు. కరాటే శిక్షణ ద్వారా క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక దృఢత్వం పెరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆత్మరక్షణ, ఆత్మగౌరవం, జ్ఞాపకశక్తి పెరుగుదల, చదువుపై పట్టు, ధైర్యం వంటి లక్షణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.ఈ జూడోకాన్ కరాటే శిక్షణ ద్వారా పిల్లలకు స్పోర్ట్స్ కోటాలో అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. కరాటే మాస్టర్ గౌని శ్రీనివాస్ పర్యవేక్షణలో శిక్షణ కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నీరటి రాఘవేందర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జడల బాలరాజ్, కావలి రాఘవేందర్, మీసాల బాలగోపాల్, మ్యాతరి రాజు, కరాటే మాస్టర్లు హరీష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిక్షణలో చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అభినందించి.. ఆశీర్వదించి..

● కౌన్సిలర్ ప్రశాంత్ రెడ్డి పదవి కాలం పూర్తి కావడంతో కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనం



కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

**జడ్చర్ల, మే 5, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్ రెడ్డి ఐదేళ్ల పదవి కాలం విజయవంతంగా ముగిసిన సందర్భంగా కాలనీ వాసుల ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రశాంత్ రెడ్డిని అభినందించి ఆశీర్వదించి ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లలోవార్డు అభివృద్ధికి ఆయన చేసిన కృషిని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో చూపిన చొరవను కొనియాడారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, సి.సి రోడ్ల నిర్మాణం మరియు పార్కుల సుందరీకరణలో ఆయన కీలక పాత్ర పోషించారని కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు. సన్మానం అనంతరం కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో గెలిపించిన వార్డు ప్రజలందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. పదవిలో ఉన్నాలేక పోయినా మీ అందరి సేవలో ఎల్లప్పుడూ ముందుంటాను. వార్డు అభివృద్ధి లో నాకు సహకరించిన కాలనీ వాసులకు, అధికారులకు ధన్యవాదాలు అని భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నరసింహారావు తాహెర్ రవికుమార్‌గౌడ్ కృష్ణమోహన్ జానకిరాములు యుగంధర్ శ్రీనివాస్ యాదవ్ ప్రముఖులు మరియు యువజన సంఘాల సభ్యులు పాల్గొని ప్రశాంత్ రెడ్డికి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు లభించాలని ఆకాంక్షించారు.

## పేదింటి ఆడపడుచులకు అండగా ప్రభుత్వం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినపల్లి, మే 5 ప్రభాతవార్త:** పేదింటి ఆడపడుచుల తల్లిదండ్రులకు ఎంతో అండగా ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల కల్యాణ లక్ష్మి ్మ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంగళవారం చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆడపిల్లలను కన్నతల్లి దండ్రుల ఆర్థిక కష్టాలను తీర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదింటి ఆడపడుచుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. పేద ప్రజలఅభ్యున్నతి కోసం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేసి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిద్దె రాములు, చంద్రగౌడ్, అమృత్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, తిరుపతయ్య, నరేందర్ గౌడ్, వేణు, వినీత్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, పుల్యా, దీప్లా నాయక్ తదితరులున్నారు.

## జీవో నెంబర్ 7ను రద్దు చేయండి



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, మే 5 ప్రభాతవార్త :** జీవో నెంబర్ 7 ను రద్దు చేసి, ఫీజ్ రీయంబర్స్ మెంట్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ బీసీ దళపతి ఆర్.కృష్ణయ్య 2008 జనవరిలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో అప్పటి ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్ మెంట్ పథకాన్ని 2008వ సంవత్సరం నుండి అమలు చేశారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచికూడా ఫీజు రీయంబర్స్ మెంట్ పథకం సాఫీగా కొనసాగిందన్నారు. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయి నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలు మూతపడే పరిస్థితి దాపురించిందని, పేద విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు. జీవో7ను రద్దు చేసిపాత పద్ధతిలోనే ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రఘు నందన చారి, కార్మిక విభాగంఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, గొడుగు నర్సిములు, రామస్వామి, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులే ప్రజలకు ఆదర్శం




పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు అందజేసిన జిల్లా ఎస్పీ డి.జానకి

(మొదటి పేజీ తరువాయి)

దిశగా ముందుకు సాగుతుంది"అని జిల్లా ఎస్పీపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఆర్బి డీఎస్పీ రమణారెడ్డి, రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గాంధీ నాయక్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య,టూ టౌన్ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్,జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, భూత్పూర్ సీఐ రామకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మోతీరామ్, రూరల్ సర్కిల్‌కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

◆ ఎస్సై జలంధర్ రెడ్డి

**పెద్దమందడి, మే 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై జలంధర్ రెడ్డి అన్నారు. ప్రమాదాలు అరికట్టడానికే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ బండి కాగితాలు కలిగి ఉండాలని, ఎండాకాలం చెరువులో, గ్రామాల్లో స్విమ్మింగ్ కు వెళ్లేటప్పుడు పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి అని ఎస్సై జలంధర్ రెడ్డి అన్నారు.

## నర్సింగ్ విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు. కేరళ రాష్ట్ర నర్సులను మరిపించేలా జోగులాంబ గద్వాల జిల్లాలో నర్సింగ్ విద్యను అభ్యసించిన విద్యార్థులు తమ సేవలం దించాలని పిలుపునిచ్చారు. ఇక్కడ నర్సింగ్ కోర్స్‌ను పూర్తిచేసిన విద్యార్థులకు ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు ఇవ్వాలని సంబంధిత యాజమాన్యాలను తాను కోరడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాక ఎక్కడ ఉద్యోగాలు వచ్చిన చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లా పేరు నిలబెట్టేలా ఇక్కడ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు తమ సేవ లందించాలన్నారు.




బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

చదువు నేర్పిన గురువులకు,తమ తల్లిదండ్రులకు,జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల పాటు విజయవంతంగా నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసి, వారు ఎక్కడ ఉద్యోగాలు చేసిన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హనుమంతమ్మ, వైస్‌ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఏవో శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

◆ మాజీ డిసిసి అధికారి ప్రతినిధి జనంపల్లి దుశ్యంతరెడ్డి

**నవాబుపేట,మే 5 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాల్లో ఐకెపి సెర్ప్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను మాజీ డిసిసి అధికార ప్రతినిధి, ఏఎంసీ చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్, గ్రామ సర్పంచ్‌లు, మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మంగళవారం ఐకెపి అధికారులు,మాజీ డిసిసి అధికారి ప్రతినిధి జనంపల్లి దుశ్యంతరెడ్డి లోకిరేవు, లింగంపల్లి, కొల్లూరు, గురుకుంట, కొండాపూర్ గ్రామాలలో వడ్ల కొలుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మకుండా ఐకెపి సెర్ప్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు పండించే వడ్లు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారని రైతులకు ఉపయోగకరంగా ఈ కొనుగోలు కేంద్రం ఉపయోగపడాలని కొనుగోలు కేంద్రం అధికారులు మంచి ధరకే కొంటారని రైతులకు నష్టం వచ్చేలా కాకుండా, లాభాలు వచ్చేలా దానికి అనుగుణంగా అధికారులు రైతులను సమన్వయం చేసుకోవాలని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఐకెపి సర్ఫ్ అధికారులు ఏఎంసీ చైర్మన్ హరిలింగం, వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేణుగోపాల్, శ్రీను, కుమార్, తానెం సురేష్, బంక వెంకటయ్య, లోకిరేవు సర్పంచ్ అనసూయ యాదయ్య, లింగంపల్లి సర్పంచ్ యాదగిరి, గురుకుంట సర్పంచ్ రవీందర్ రెడ్డి, కొండాపూర్ సర్పంచ్ రాఘవేందర్, గ్రామాల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దుష్యంత్‌రెడ్డి

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అందరు సహకరించాలి

◆ ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత ◆ అదనపు ఎస్పీ రాజేష్ మీనా

**వనపర్తి, మే 5, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా అన్నారు. మంగళవారం రోజు వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా బ్లూసి హోటల్ ముందు వాహనాలు రోడ్డు మీద పార్కింగ్, షాపులు బోర్డులు పెట్టి ఆక్రమణలు చేసి రాకపోకలకు అంతరాయం కలుగజేస్తున్న షాపుల యాజనులకు, వాహనదారులకు అదనపు ఎస్పీ వనపర్తి డిఎస్పీ, గిరిబాబు తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు అందరి సొత్తు ఒక్కరి సౌలభ్యం కోసం ఇతరులకు ఇబ్బంది కలిగించరాదు. షాపుల ముందు వస్తువులు పెట్టడం, రోడ్డు ఆక్రమించడం వల్ల ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయని, అనవసర పార్కింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్,ఓవర్ స్పీడ్ వంటి తప్పులు ప్రమాదాలకు దారితీస్తాయని అన్నారు. పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలి వారు కూడా సురక్షితంగా ప్రయాణించాలని ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు కలిసి సహకరిస్తేనే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యం అన్నారు. భద్రతే లక్ష్యం నియమాలే రక్షణ" అనే భావనతో ముందుకు సాగాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, ట్రాఫిక్ ఆర్ఎస్సై సురేందర్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ

## తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మే 7న గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులతో,జిల్లా కలెక్టర్‌లతో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలపై నిర్వహించే సమావేశం చర్చిస్తారని తెలిపారు. మొదటిదశలో దేవరకద్ర నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు అయినట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేవిధంగాఅధికారులుచర్యలు తీసుకోవాలని అన్నారు.

**గ్రామ సమస్యల పరిష్కారానికి సమన్వయం అవసరం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

గ్రామాల్లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో సర్పంచులతో కలిసి గ్రామ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు తమ గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజ్, సిసి రోడ్లు, పాఠశాల ప్రహరీ గోడలు, అంగన్వాడీ భవనాలు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రతి గ్రామాన్ని సందర్శించడం సాధ్యం కాకపోయినా, ఇలాంటి సమావేశాల ద్వారా సమస్యలను తెలుసుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. కొన్ని సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కరించవచ్చని, మరికొన్ని మండల మరియు జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సి ఉంటుందని వివరించారు. సర్పంచులు ప్రజలకు దగ్గరగా ఉంటారని, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. గ్రామపంచాయతీలకు లభ్యమవుతున్న 15వ ఆర్థిక సంఘం నిధులను సమర్థంగా వినియోగించి తాగునీరు, డ్రైనేజ్ వంటి అత్యవసర పనులను చేపట్టాలని సూచించారు. ఈ నిధులతో గ్రామ స్థాయిలోనే అనేక సమస్యలను పరిష్కరించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్య లను ఎంపీడీవోలు ద్వారా పంపితే త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. సంబంధిత ఫైళ్లను వెంటనే పీడీ హౌసింగ్‌కు పంపాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో మల్టీపర్పస్ వర్కర్ల నియామకంపై త్వరలో నిర్ణయం తీసుకుని ప్రతి గ్రామపంచాయతీకి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లో మిషన్ భగీరథ అధికారులతో కలిసి తక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. మిషన్ భగీరథమరియు విద్యుత్‌శాఖ అధికారులు సమన్వ యంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమావేశం అనంతరం అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలపై దిశానిర్దేశం చేస్తామని కలెక్టర్ తెలిపారు.

**సర్పంచుల వినతి...**

సర్పంచులు తమ తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరంగా ప్రస్తావించారు. ముఖ్యంగా గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్త బోర్లు త్రవ్వించాలని, ఇప్పటికే ఉన్న బోర్లను మరమ్మతు చేయాలని కోరారు. అదనంగా, కొన్ని గ్రామాలకు కొత్త ఓవర్ హెడ్ ట్యాంకులు అవసరమని, ప్రస్తుతం ఉపయోగిస్తున్న పైపులు పాతబడిపోయాయని, వాటిని తొలగించి పెద్ద వ్యాసం (డయా)గల పైపులను అమర్చాలని సూచించారు. దీనిపై మిషన్ భగీరథ అధికారులు స్పందిస్తూ, ఎక్కువ గ్రామాల్లో నీటి సరఫరా కొనసాగుతోందని, అయితే ఎత్తైన ప్రాంతాల్లో ఉన్నకొన్ని గ్రామాల్లోనీటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆ సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఇతర మున్సిపాలిటీలతో పోల్చితే తమ ప్రాంతంలో ఆస్తి పన్ను అధికంగా వసూలు చేస్తున్నారని, వెంటనే తగ్గించాలని కోరారు. జానంపేట సర్పంచ్ మాట్లాడుతూ బొక్కల ఫ్యాక్టరీ నుంచి వస్తున్న దుర్గంధం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకుంటారని హామీఇచ్చారు. సమావేశంలో స్థానిక సంస్థలఅదనపు కలెక్టర్ మధు సూదన్‌నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూత్పూర్‌మున్సిపల్ చైర్మన్‌బాలకోటి, దేవరకద్రమున్సిపల్ చైర్‌పర్సన్ దమయంతి గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, గ్రామసర్పంచులు, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకుల చేరిక



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బిఆర్ఎస్ నాయకులు

**రాజాపూర్, మే 5 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని కుచ్చర్‌కల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత మీద, ఆమె ఏర్పాటు చేసిన కొత్త రాజకీయపార్టీ మీద ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్ చేసారు. కల్వకుంట్ల కుటుంబానికి సంబంధించి ఇప్పుడు రెండు పార్టీలు అయ్యాయని, ఒక వైపు బీఆర్ఎస్, మరోవైపు టీఆర్ఎస్ పార్టీలుగా ఏర్పడ్డాయని అన్నారు. కవిత కొత్తగా పెట్టిన పార్టీ పేరు ఏమిటని ఆరా తీసిన ఎమ్మెల్యేకి అక్కడున్న నేత ఒకరు కొత్త పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన అని చెప్పగా, అది తెలంగాణ రక్షణ సేన కాదది, తెలంగాణ రాక్షస సేన పార్టీ అంటూ అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. అలాగే గ్రామానికి సంబంధించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కుచ్చర్‌కల్ గ్రామాన్ని సుజయ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పాఠశాలకు కాంపౌండ్ వాల్ గ్రామంలో రోడ్లు పలువురికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని ఇకముందు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎవ్వరికి కావలసి వచ్చిన నా సంతకం పెట్టిన లెటర్‌ను సుజయ్ చంద్రా రెడ్డికి అందజేస్తున్నానని డబల్ బెడ్ రూమ్‌లు ఎవరెవరికి కావాలో వారి పేర్లు అందులో రాసినాకు పంపాలని సుజయ్ చంద్రా రెడ్డికి సూచించారు. అలాగే నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోటే నాగేష్, మాజీ సర్పంచ్ యాదగిరి, రాములు మాజీ వార్డ్ మెంబర్, కుమ్మరి రాజు, శివలింగం మాజీ వార్డ్ మెంబర్, మాజీ వార్డ్ మెంబర్ రియాజ్ , కుమ్మరి రవి, కొండమ్మ, చీమల మల్లేష్ మహమ్మద్ యూసుఫ్ తదితరులను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు క్షేమంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

బలంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ కూడా స్థిరంగా ఉంటుందన్నారు. రైతు కష్టానికి సరైన గౌరవం, ధరలు, సాంకేతిక సహాయం లభిస్తే రాష్ట్రం మొత్తం అభివృద్ధిదిశగా ముందుకు సాగుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండ లాల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి, ఏవో రాజేందర్ అగర్వాల్, హార్టికల్చర్ అధికారి శృతి,హార్టికల్చర్ అధికారులు,జిల్లా అధికారులు, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్‌రెడ్డి,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



గన్ని సంచుల స్టాక్ ను పరిశీలిసున్న కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

తలెత్తినప్పుడు వెంటనే వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలియజేసి సంబంధిత ఉన్నతాధికారులతో తక్షణ పరిష్కారం పొందాలని ఆయా కేంద్రాల ఇన్చార్జిలకు, అధికారులకు సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం వర్షం పడితే తడవ కుండా సాయంత్రం ఇంటికి వెళ్లే ముందు టార్పాలెన్స్ కప్పి వెళ్లాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపనితీరును సంబంధిత అధికారులు తరచూపర్యవేక్షణ చేస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంవహిస్తే,అవకతవకలకు పాల్పడితే సంబంధిత కేంద్రాల ఇన్చార్జిలు, అధికారులపై తగుచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీలో డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాస్, డిపిఎం అరుణ, ఏఈఓలు ఉషశ్రీ, రవి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించేందుకు ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పాలు మరియు మట్టి, గడ్డి లేకుండా చర్యలు తీసుకోవాలని కొనుగోలు విషయంలో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులకు మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటుగా పెంట్లు వేసి రైతులకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని కలెక్టర్. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి అంటూ కలెక్టర్ దృష్టికి తేవడంతో సాయంత్రం లోపుగా అవసరమైన మేర లారీలను రప్పించి ధాన్యాన్ని మొత్తం రైస్ మిల్లర్లకు చర్చి ఎందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు తొందరపడి వరి ధాన్యాన్ని పైకి వ్యక్తులకు విక్రయించవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దని విక్రయించేందుకు ముందుకు రావాలని తద్వారా తమ ఖాతాలో నగదు జమ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణ నుండి కోర్టుకు వెళ్లే రహదారిని పరిశీలించి పనులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంబడి ఆత్మకూరు తాసిల్దార్ జెకే మోహన్ ఎంపీడీవో శ్రీపాదూ బిసిఎస్ కార్యదర్శి నరేష్ ఏటీఎం శ్రీరాంరెడ్డి తదితరులతో పాటుగా పలువురు ప్రభుత్వాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ నిరీక్షణ..

(మొదటి పేజీ తరువాయి)



పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు, వృద్ధులు

కూడా ప్రారంభమైనప్పటికీ డబ్బులు అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు అధికారుల చుట్టు తిరుగుతున్నాం కానీ ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. మేము పూర్తిగా విసిగిపోయాం" అంటూ వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లు అడిగేటప్పుడు మా దగ్గరకు వచ్చే నాయకులు ఇప్పుడు మా సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదు?" అంటూ రాజకీయ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్‌పైనే ఆధారపడే వృద్ధులు, వికలాంగులకు ఈ ఆలస్యం పెద్ద దెబ్బగా మారింది. రోజువారీ అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. కొందరు ఔషధాలు కొనలేక ఇబ్బందులు పడుతుండగా,మరికొందరు అప్పులు చేసి గడుపుతున్నామని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు లబ్ధిదారులు సంబంధిత అధికారులను కలిసి పింఛన్‌పై స్పష్టత కోరగా, డబ్బులు ఎప్పుడు వస్తాయో మేము చెప్పలేం.. పై నుంచి నిధులు రాలేదు" అనే సమాధానం రావడం మరింత ఆగ్రహానికి దారితీసింది. లిక్విడ్ క్యాష్ కొరత కారణంగా నిధులు ఆలస్యమవుతున్నాయని, రిజర్వ్ బ్యాంక్ నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందని అధికారులు వివరణ ఇచ్చినప్పటికీ, ఇది లబ్ధిదారులను మరింత అసంతృప్తికి గురిచేసింది. ప్రభుత్వం ప్రకటించిన పథకాల అమలులో ఇలాంటి నిర్లక్ష్యం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వృద్ధులు,వికలాంగులు వంటి బలహీన వర్గాలకు సంబంధించిన పింఛన్ల విషయంలో కూడా సమయపాలన లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న ఏప్రిల్ పింఛన్‌ను విడుదల చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఆలస్యాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## ఘనంగా గజలమ్మ జాతర మహోత్సవాలు

**దామరగిద్ద, మే5 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలో గజలమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర తొలిరోజు సందర్భంగా ఉదయం అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా జల్దిబిందె కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించగా, గ్రామం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. జాతర వేడుకల్లో మహిళలు, యువతులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని ఉత్సాహాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బక్కనర్సప్ప, ఆలయ పూజారులు కమ్మరి రవి, మోనేష్, గజలప్ప, బాబు, జోషి, ఎంకప్ప, మాణిక్యప్ప, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

